# కాంపెన్సేషన్

ఎవరైనా కనిపిస్తే నిప్పుకోడి తన తలని ఇసుకలో దూర్చేస్తుందట. అయితే; శివరావుకు ఎవరు కనపడినా కనబడకున్నా, తన తలని ఫైళ్ళలో దూర్చేసుకునే వుంటాడు. ఒకవేళ ఏ దుర్మార్గులయినా శివరావును చంపదగినయట్టి శత్రువుగా భావించి (సారీ... శివరావు అజాతశత్రువు లెండి) సరాసరి ఆఫీసులోకి వచ్చారంటే వెంటనే చంపాలనే ప్రయత్నాన్ని విరమించుకుని వెళ్ళిపోతారు.

ఎంచేతంటే - 'జీవితమంతా ఇలా ఫైళ్ళతో చిత్రవధ అయి చావనీ - ఒక్కసారి చస్తే ఎలా?' అనీ.

అసలు శివరావుకి ఫైళ్ళను పెండింగులో ఉంచడమన్నా, ఆఫీసరు చేత చివాట్లు తినడమన్నా పరమ అసహ్యం. అందుకే ఏదయినా అర్జీనో, అఫిషియల్ ఉత్తరమో వస్తే, దాని మీద వెంటనే చర్య తీసుకునే వరకూ నిద్రపోడన్న మాట!

ఆ రోజు శివరావు ఆఫీసుకు వచ్చి తన సీట్లో కూచుంటూనే తన టపాల్ని తెచ్చి యిచ్చాడు అటెండరు. మామూలుగా తనకు వచ్చిన టపాని మొదటిసారి అశ్రద్ధగానూ, రెండోసారి శ్రద్ధగానూ, మూడోమారు అతి శ్రద్ధగానూ చదవడం శివరావు అలవాటు. తర్వాత, టపాని తన వ్యక్తిగత రిజిష్టరులో నమోదు చేసుకుని, ఆ తర్వాత దేని మీద 'చర్య' తీసుకోవాలో, దేని మీద 'సత్వర చర్య' తీసుకోవాలో నిర్ణయించుకుంటాడతను. అలా నిర్ణయించిన వెంటనే తన కలాన్ని తెల్లకాగితం మీద కదనుతొక్కిస్తాడంతే!

తన కొచ్చిన టపాని క్షుణ్ణంగా చదువుతూ వుండగా - ఓ అర్జీ అతన్ని ఆకర్షించింది. మళ్ళీ ఓసారి చదవడం ప్రారంభించాడు శివరావు. అందులో ఇలా వుంది.

“మహారాజ రాజశ్రీ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ గారి దివ్య సముఖమునకు - అగ్రహారం మజరా చెరువులోపల్లి గ్రామ కాపురస్తురాయలయిన లేట్ మల్లెల పుల్లయ్య భార్య మల్లెల మల్లమ్మ వ్రాసుకొన్న మనవి అర్జీ ఏమనగా-

దేవరా!

నేను కడు బీదరాలిని. సుమారు 5 సంవత్సరముల కిందట మా గ్రామ పొలం సర్వే నెంబరు 116 లో 0-10 సెంట్ల భూమిని ప్రభుత్వం వారు కాలువ త్రవ్వుటకుగాను తీసుకొన్నారు. దానిమీద మీరు కావలసిన వివరములన్నియూ సేకరించుకొనిపోయినారు. అయిననూ - ఇంతవరకూ మాకు రావలసిన భూమి పరిహార మొత్తము (కాంపేన్‌సేషను)ను ఇవ్వనే లేదు. ఈ విషయము మీద నా భర్తగారయిన లేట్ మల్లెల పుల్లయ్య పెక్కు అర్జీలు మీ ఆఫీసుకు వ్రాసీ, వ్రాసీ చివరకు ఆశలు వదులుకున్నారు. ప్రస్తుతము ఆయన స్వర్గస్థులయినారు. కావున, కామందుల వారు నా యందు దయయుంచి, మా భూమికి రావలసిన పరిహార మొత్తమును తొందరగా యిప్పించగలరని మీకు వినయపూర్వకంగా మనవి చేసుకొనుచున్నాను.

ఇట్లు,
మల్లెల మల్లమ్మ!!

'అయిదేళ్ళుగా మల్లమ్మకు రావలసిన కాంపెన్‌సేషన్ రాలేదు అన్నది శివరావుకు బాధ కలిగించిన విషయం - ఒక వేపు తమ భూమిని పోగొట్టుకోడం మరో వేపు ఎంతకీ రాని డబ్బుకోసం ఎదురుచూస్తూ అర్జీలు రాసుకోడం - పాపం! అనిపించింది. వెంటనే దానికి సంబంధించిన ఫైలుని గబగబా వెతకసాగాడు శివరావు. ఓ పదిహేను నిమిషాలు వెదికాకగానీ ఫైలు దొరక లేదు.

ఆత్రంగా ఫైలునైతే వెదికి తీశాడుగానీ, ఫైలుని సొంతం చదువుతుంటే ఏం రాయాలో బోధపడలేదతనికి.

నిజానికీ ఏ ఆఫీసులోనైనా ఎక్కువ ఫైళ్ళు పెండింగులో వుండడానికి ఒక కారణం సోమరితనమైతే, రెండో కారణం- ఫైళ్ళకు సంబంధించిన వ్యక్తుల నుంచి అంతో ఇంతో "గిట్టుబాటు" అవుతుందనుకోవడం; ఇక మూడో కారణం ఫైళ్ళ స్వభావం క్లర్కుకి అంతుపట్టక పోవడం!

మూడో కారణం - అప్పుడు శివరావుకి ఎదురయింది పాపం!

అందుకే - ఆ ఆఫీసులో సీనియర్ మోస్టు గుమాస్తా సోమశేఖర్‌ని ఆశ్రయించాడు శివరావు.

సోమశేఖర్ ఓసారి ఫైలునంతటినీ మొదటి నుంచి తిరగేస్తూ విహంగ దృష్టిలో అక్కడా అక్కడా... చూస్తున్నాడు. భూ సంపాదన (ల్యాండు అక్విజిషన్) సబ్జెక్టు అంటే అతనికి కొట్టిన పిండి!

ఉన్నట్టుండి ఫక్కున నవ్వాడు సోమశేఖర్....

అయోమయంగా చూశాడు శివరావు, అతని వేపు.

"శివరావ్! ఈ అక్షరాలు చూశావా? ఎవరి వనుకున్నావ్?" అంటూ ఫైలులో ఓ ఉత్తరాన్ని చూపాడు సోమశేఖర్.

"ఇవి...ఇవి...మీ అక్షరాల్లాగే వున్నాయి సార్!" అన్నాడు శివరావు. ఆ ఉత్తరంలోని అక్షరాల్ని పరిశీలించి చూస్తూ - 'అయితే? ఈ మాత్రానికే ఎందుకు నవ్వాలో!?'

అనిపించింది శివరావుకి.

"యగ్జాక్లీ కరెక్ట్! నా అక్షరాలే... నాలుగేళ్ళ క్రితం నేను ఈ ఆఫీసులోనే వర్కు చేశానయ్యా. అప్పుడు నేను నీ 'సీటు' డీల్ చేసేవాణ్ణి! అప్పటి నుంచి ఇప్పటిదాకా ఈ ఫైలు డిస్పోజ్ కాలేదన్నమాట! చూశావా - ఈ ఫైళ్ళు ఎంత నత్తనడక నడుస్తున్నాయో. ఈ మధ్యలో నేను గుత్తిలో పనిచేసి వచ్చాను కూడా!" అంటూనే మళ్ళీ ఫైలు చదవడంలో వుండి పోయాడు సోమశేఖర్.

ఓ అయిదు నిమిషాల తర్వాత 'ఫెడిల్, పెడిల్' మంటూ నవ్వాడు సోమశేఖర్.

అందులో అంత గొప్ప నవ్వు తెచ్చే విషయం ఏముందో అర్థం కావడంలేదు శివరావుకి.

"ఏమయ్యో సోమశేఖర్! అంత గట్టిగా నవ్వుతున్నావు? నువ్వు చదువుతోంది ఫైలా? జోకులా?" అన్నాడు పక్క సీటులోని క్లర్కు గోపాలరావు - తన ఫైలు లోంచి తల ఎత్తకుండానే.

"ఈ ఫైల్లో జోకులున్నాయి గోపాల్రావ్!"

"అరెరె... నిజంగా... అదెలా సాధ్యం?" అంటూ పెన్నునూ, కళ్ళజోడునీ టేబులు మీద పెడుతూ తన బట్టతలని సుతారంగా గీరుకున్నాడు గోపాలరావు.

"అవును మరి, జోకు కాకపోతే మరేమిటి.. సూది బరువును మోయడానికి వెరచి, వెనకటి కెవడో తాటి చెట్టుకు గుచ్చుకొని వెళ్ళాడట - అలావుంది - ఈ ఫైలులోని కథనం..."

"అంటే...?"

"అంటే గింటే ఏముందీ? అయిదేళ్ల క్రితం చెరువు లోపల్లిలో కాలువకుగానూ పుల్లయ్య భూమిని మనవాళ్లు ఓ పదిసెంట్లు అక్వయిరు చేశారు. అలా అక్వయిరు చేసిన రెండేళ్ళలో మన సర్వేయర్లు వెళ్లి కొలతలు వేసి వచ్చారు. డిప్యూటీ తహాసిల్దారూ, రెవెన్యూ ఇన్స్పెక్టరూ వెళ్లి స్టేటుమెంట్సు, సేల్సు స్టాటిస్టిక్సూ తెచ్చారు. ఆ తర్వాత మన డిప్యూటీ కలెక్టర్ గారు వెళ్లి అవార్డు ఎంక్వయిరీ కూడా చేశారు. ఇదంతా జరిగేటప్పటికి సదరు పుల్లయ్యగారు స్వర్గానికి టపా కట్టేశారు. అక్కడికి ఫైలు ఆగిపోయింది. ఇప్పుడు సదరు పుల్లయ్య భార్య మల్లమ్మ తిరిగి తనకు కాంపెన్ సేషను చెల్లించండంటూ అర్జీ ఇచ్చుకుంది. అయితే - ఇంతవరకూ జోకు ఏమీ లేదు కానీ, అసలు జోకు ఇప్పుడు మొదలవుతుంది. ఆ పది సెంట్ల భూమిని కొలత వేయడానికీ, భూమి ఆసామితో స్టేటుమెంట్సు తీసుకురావడానికీ, సేల్సు స్టాటిస్టిక్స్ తీసుకురావడానికి వెళ్లిన మన అధికారుల, అటెండర్ల టిఏలూ, డిఏలకూ ఇక మన ఎస్.డి.సి. (స్పెషల్ డిప్యూటి కలక్టెరు) గారు తిరిగిన జీపు పెట్రోలు ఖర్చులూ, ఎస్.డి.సి. గారి జీపు డ్రైవరు డి.ఎ.లూ, అన్నీ కలిపి ఎంత లేదన్నా కనీసం ఓ వెయ్యి రూపాయిలు దాటి వుంటుంది. ఇంత హడావిడీ చేసింది ఎన్ని రూపాయిలకి అనుకున్నారు? అష్టరాల్ తొంభయి నాలుగు రూపాయిల నలభై పైసలకు! అదీ మరి

అసలు జోకు!" అంటూ చిన్నపాటి లెక్చరిచ్చాడు సోమశేఖర్.

"ఈజీట్!? నిజంగా గొప్ప జోకే నండోయ్! మీరు ఘటికులు - భలే ఎనలైజ్ చేశారు. అసలు గవర్నమెంటు డబ్బు ఎంత వృధా అయిపోతోందో చూడండి! రియల్లీ హారిబుల్" అన్నాడు గోపాలరావు.

శివరావుకి కూడా ఈ విషయం భలే వింతగా అనిపిస్తోంది.

"బాగా చెప్పారండీ మీరు!" అంటూ అభినందించాడు సోమశేఖర్‌ను, ఎదురుగా వుంటున్న గుమస్తా సలీం.

"థేంక్యూ!" అన్నాడు గర్వంగా సోమశేఖర్. కాసేపు ఆఫీసులో నిశ్శబ్దం ఆవరించింది. సోమశేఖర్ ఫైలు చివర్లో చదువుకున్నాడు. మళ్లీ నవ్వుతాడేమోనని సోమశేఖర్ మొహంలోకి చూస్తూ వున్నాడు శివరావు.

"అ... ఇప్పుడేం చేయాలి మనం?" అన్నాడు సోమశేఖర్ స్వగతంగా, పెన్నును మునిపళ్లతో సున్నితంగా కొరుకుతూ.

"అది తెలీకే కద సార్! మీ దగ్గిర కొచ్చిందీ!" అన్నాడు శివరావు. అతని దగ్గరున్న చనువుకొద్దీ.

"అమ్మో! కుర్రాడు మాటలు నేర్చాడండీ..." అంటూ పరధ్యానంగా మాట్లాడుతూనే "అ... చూడు శివరావ్! ఈ మల్లెల మల్లమ్మకి ఓ 'ఎండార్స్‌మెంటు' ఇవ్వు సరిపోతుంది" అంటూ ఫైలు శివరావుకి ఇవ్వబోతుంటే-

"అది కూడా ఎలా యివ్వాలో చెబితే..." అంటూ గొణిగాడు శివరావు.

"ఊ...అయితే రాసుకోవయ్యా చెబుతాను." అంటూ చెప్పసాగాడు.

"ఎండార్స్ మెంటు

చెరువులో పల్లి గ్రామ కాపురస్తురాలయిన శ్రీమతి మల్లెల మల్లెమ్మ గారికి-

మీ అర్జీని పరిశీలించడం జరిగింది. చెరువులో పల్లి గ్రామ సర్వే నెం. 116 విస్తీర్ణం 0.10 సెంట్లను కాలువ నిమిత్తం అక్వయిరు చేసినందుకుగానూ మీ పరిహార మొత్తము రూ. 94-40 పైసలు, మీకు ఇచ్చుటకు మాకు ఎట్టి అభ్యంతరమున్నూ లేదు. అయితే, మీ భర్తగారయిన మల్లెల పుల్లయ్య చనిపోయినందున మీరు వారసత్వ సర్టిఫికెట్టు (లీగల్ హెయిర్ సర్టిఫికెట్)ను తీసుకుని ఖుద్దున మీరు మా కార్యాలయమునకు వచ్చి, మీ డబ్బును మీరు తీసుకుని వెళ్లవలసినదిగా ఇందుమూలముగా మీకు తెలియపరచడమైనది.

- ప్రత్యేక డిప్యూటి కలెక్టరు

...ఇలా రాసి పడేస్తే సరి...." అంటూ శివరావుకి ఫైలు ఇచ్చేశాడు సోమశేఖర్.

ఆ 'ఎండార్సుమెంటు'ను ఆఫీసర్‌తో అప్రూవ్ చేయించి, ఆ రోజే దాన్ని డిస్పాచ్ చేయించాడు శివరావు.

* * *

నెల రోజుల తర్వాత-

శివరావు తనకి వచ్చిన టపాని చూస్తూ వుంటే మల్లెల మల్లమ్మ లేఖ మళ్లీ కన్పించింది.

ఉత్సాహంగా అందుకుని చదవసాగాడు శివరావు. "మహారాజ రాజశ్రీ ప్రత్యేక డిప్యూటి కలెక్టరుగారికి!"

అయ్యా!

మీరు ఇచ్చిన 'ఎండార్సుమెంటు' నాకు తీవ్రమయిన బాధనూ, అమిత నిరుత్సాహాన్నీ కలిగించింది. అది ఎట్లనగా – మీరు 'వారసత్వపు సర్టిఫికెట్టు' అడిగినారు కదాయని దానిని పొందుటకుగానూ నేను మేజిస్ట్రేటు వద్దకు వెళ్లగా – నా భర్త చనిపోయినటుల మరణ సర్టిఫికెటు కావాలని అనిరి. దానికోసం పంచాయితీ కార్యాలయం చుట్టూరా పదే పదే తిరిగి, ఎట్లో దానిని సంపాదించితిని. ఇంక "వారసత్వపు సర్టిఫికెట్టు" పొందడమే తడవు కదా! యని కోర్టుదగ్గరకు వెళ్లగా, మేజిస్ట్రేటును నేను చూచు భాగ్యమే కలుగలేదు. నా కాళ్లు అరిగిపోయినవే కాని వారసత్వపు సర్టిఫికెట్టు నా చేతికింకనూ రాలేదు. అయితే– ఇప్పటి వరకూ నాకు, మా ఊరి నుండి తాడిపత్రికి తిరిగిన ఖర్చులు నూరు రూపాయిలు అయినవి.

ఒక వేళ వారసత్వపు సర్టిఫికెట్టు తెచ్చి, మీ కార్యాలయములో ఇచ్చి, నాకు వచ్చు 'పరిహారం' మొత్తము పొందుటకు మరొక 'నూరు' ఖర్చు కాగలదని భావించుచున్నాను. ఈ లెక్కన – నేను నాకు రావలసిన పైకము రూ. 94–40 పైసలను వదులు కొనుటయే ఉత్తమమని తోచుచున్నది. నాకు వచ్చు పైకము ప్రభుత్వ ఖజానాకే కట్టివేయమని కోరడమైనది.

– మల్లెల మల్లమ్మ.

అంతా చదివాక జాలిగా నవ్వుకున్నాడు శివరావు.

*(ఆంధ్రజ్యోతి వీక్లీ 6–9–91)*